నిప్పుతో నిరసనకు ప్లాన్

- పార్లమెంట్‌లో అలజడి సృష్టించేందుకు నిప్పంటించుకొని దూకాలని ఆలోచన
- కరపత్రాలు విసరాలనేది ఇంకో ప్లాన్
- చివరికి మూడో ప్రణాళికనే ఖరారు
- పోలీసు విచారణలోనిందితుల వెల్లడి
- పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన ఘటనలో ఆరో నిందితుడి అరెస్టు
- సీన్ రీ కన్‌స్ట్రక్షన్ యోచనలో పోలీసులు

న్యూఢిల్లీ/కోల్‌కతా, డిసెంబర్ 16: పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం ఘటనలో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. లోక్‌సభలో గ్యాలరీ నుంచి సభా మందిరంలోకి దూకి పొగ వదిలిన నిందితులు.. వాస్తవానికి వేరే ప్లాన్లు కూడా వేశారని ఢిల్లీ పోలీసు వర్గాలు శనివారం పేర్కొన్నాయి. ఒంటికి నిప్పంటించుకోవడం, సభలో కరపత్రాలు విసిరేయడం వంటివి చేయాలని అనుకొన్నారని, అయితే బుధవారం జరిగిన ఘటననే తుది ప్లాన్‌గా అమలు చేశారని తెలిపాయి. ఢిల్లీ పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ నిందితులు సంచలన చర్య ద్వారా ప్రభుత్వానికి ఒక బలమైన సందేశం ఇవ్వాలని అనుకొన్నారని పేర్కొన్నారు. ఒంటికి ఫైర్ ప్రూఫ్ జెల్‌ను పూసుకొని నిప్పంటించుకోవడం లేదా కరపత్రాలను విసరడం వంటివి చేయాలని నిందితులు భావించారని వెల్లడించారు. ఈ విషయాలను నిందితులు విచారణలో చెప్పారని పేరు చెప్పేందుకు ఆ అధికారి తెలిపారు.

బీజేపీ ఎంపీ స్టేట్‌మెంట్ రికార్డు యోచనలో పోలీసులు

ఢిల్లీ పోలీసులు మైసూర్ బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఇద్దరు నిందితులకు ఎంపీ కార్యాలయం నుంచే పార్లమెంట్ విజిటర్ పాస్‌లు అందినట్టు ప్రాథమికంగా వెల్లడైన విషయం తెలిసిందే. మరోవైపు దర్యాప్తు భాగంగా అధికారులు నిందితులను వారు గతంలో కలిసిన పలు ప్రాంతాలకు తీసుకెళ్లారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న లలిత్ ఝూను ఢిల్లీ నుంచి పారిపోయిన తర్వాత ఆశ్రయం తీసుకొన్న రాజస్థాన్‌లోని నాగౌర్‌కు తీసుకెళ్లనున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తనతో పాటు ఇతర నిందితుల ఫోన్లను ధ్వంసం చేసిన ప్రాంతానికి తీసుకెళ్తామని పోలీసు అధికారి ఒకరు పేర్కొన్నారు. కాగా, ఈ నెల 13న జరిగిన భద్రతా ఉల్లంఘన ఘటన సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసేందుకు ఢిల్లీ పోలీసులు పార్లమెంట్ అనుమతి కోరనున్నారని తెలుస్తున్నది.



పోలీస్ కస్టడీకి అరో నిందితుడు

మరోవైపు ఈ కేసులో ఢిల్లీ పోలీసులు శనివారం అరో వ్యక్తిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి అతడిని 7 రోజుల పోలీసు కస్టడీకి అప్పగించారు. లలిత్ ఝూ ఢిల్లీ నుంచి పారిపోవడంలో సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహేశ్‌ను కస్టడీలోకి తీసుకొన్నామని వెల్లడించారు.

'ఇండియాకు ఒక బాంబు కావాలి'

మరోవైపు 'ఇండియాకు ఇప్పుడు ఒక బాంబు కావాలి. దౌర్జన్యం, అరాచకత్వం, అన్యాయాలకు వ్యతిరేకంగా ఒక బలమైన గొంతుక కావాలి' అంటూ లలిత్ ఝూ అక్టోబర్ 26న సోషల్ మీడియాలో చేసిన పోస్ట్‌ను ఢిల్లీ పోలీసులు వెలికితీశారు. అతడి సోషల్ మీడియా ఖాతా నిండా ఇలాంటి రెచ్చగొట్టే పోస్టులు ఉన్నాయని తెలిసింది. అయితే తన కొడుకు ఇలాంటి నేరాలకు పాల్పడడని లలిత్‌ఝూ తండ్రి దేవానంద్ అన్నారు. మరో నిందితురాలు నీలం తల్లిదండ్రులు ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని కోరుతూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో పిటిషన్ వేశారు.

లలిత్‌ఝూకు టీఎంసీతో సంబంధాలు!

లలిత్‌ఝూకు టీఎంసీ యూత్ వింగ్‌తో సంబంధాలు ఉన్నాయని పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి శనివారం ఆరోపించారు. ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు సహా పలువురు టీఎంసీ నేతలు, ఆ పార్టీ యువ నేతలతో లలిత్ ఝూ కలిసి దిగిన ఫొటోలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సువేందు ఆరోపణలు టీఎంసీ కొట్టిపారేసింది.

ఎంపీలకు స్పీకర్ ఓంబిర్లా లేఖ

పార్లమెంట్ ఘటన నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఎంపీలకు లేఖ రాశారు. ఇది దురదృష్టకర ఘటన అని పేర్కొన్నారు. ఘటనపై ఆ రోజునే అన్ని పార్టీల నేతలతో సమావేశమయ్యానని, భద్రతా చర్యల బలోపేతంపై సలహాలు తీసుకొన్నామని తెలిపారు. లోతుగా దర్యాప్తు చేసేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పలువురు ఎంపీల సస్పెన్షన్‌కు, భద్రతా ఉల్లంఘన ఘటనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఈ రెండింటికీ మధ్య లింక్ పెట్టేందుకు పలువురు ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రయత్నించడం దురదృష్టకరమని, సభ పవిత్రతను కాపాడేందుకే తాను ఆ నిర్ణయం తీసుకొన్నానని స్పీకర్ ఓంబిర్లా లేఖలో చెప్పారు.

ఐఫోన్ యూజర్లకు ప్రభుత్వం హెచ్చరిక

న్యూఢిల్లీ : యాపిల్ ప్రొడక్ట్స్ యూజర్లకు కేంద్రం హెచ్చరిక జారీ చేసింది. ఐఓఎస్, ఐపాడ్‌ఓఎస్, మేక్‌ఓఎస్, టీవీఓఎస్, వాచ్‌ఓఎస్, సఫారీ బ్రౌజర్ వంటి యాపిల్ ఉత్పత్తుల్లో అనేక బలహీనతలు వెల్లడైనట్లు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ-ఐఎన్) శుక్రవారం తెలిపింది. అటాకర్లు వీటి లోని సున్నితమైన సమాచారాన్ని దొంగిలించే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఆర్బిట్రరీ కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేయగలుగుతారని, భద్రతాపరమైన ఆంక్షలను పక్కనపెట్టి సమాచారాన్ని దొంగలించగలరని,సేవలను నిరాకరించే పరిస్థితులను సృష్టించగలరని, ఆథెంటికేషన్‌ను కూడా తప్పించుకుని చొరబడే అవకాశం ఉందని, స్పూఫింగ్ అటాక్స్ చేయవచ్చని కేంద్రం హెచ్చరించింది.

'మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్‌పై 24 గంటల్లో తెలపాచ్చు'

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: మనీ లాండరింగ్ కేసులో నిందితుడి అరెస్ట్‌కు గల కారణాలను అతడికి 24 గంటల్లో తెలియజేయవచ్చునని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. పంకజ్ బన్సాల్ కేసులో రిజర్వ్ ఉంచిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం వెలువరించింది. నిందితుడి అరెస్ట్‌కు గల కారణాలను 24 గంటల్లోగా ఈడీ రాతపూర్వకంగా వివరించాలని జస్టిస్ బేలా ఎం త్రివేది తదితరులతో కూడిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. మనీ లాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ సూపర్‌టెక్ రియల్ ఎస్టేట్‌కు చెందిన రామ్ కిశోర్ అరోరా దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

పోలీసులు, క్రిమినల్ కోర్టు పాస్‌పోర్ట్ సీజ్ చేయలేరు

కర్ణాటక హైకోర్టు కీలక వ్యాఖ్యలు

బెంగళూరు, డిసెంబర్ 16: ఏదైనా కేసు విషయంలో పాస్‌పోర్టును సీజ్ లేదా స్వాధీనం చేసుకునే అధికారాలు పోలీసులు, క్రిమినల్ కోర్టులకు లేవని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్-102, 104 కింద ఏవైనా పత్రాల్ని స్వాధీనం చేసుకోవచ్చునని, పాస్‌పోర్ట్‌కు ఇది వర్తించదని హైకోర్టు తేల్చిచెప్పింది. వ్యాపారవేత్త శంభుకుమార్ కాసిల్వాల్ తన పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేయాలంటూ 'డెట్ రికవరీ ట్రిబ్యునల్-1' (డీఆర్‌టీ) ఇచ్చిన ఆదేశాల్ని హైకోర్టు కొట్టేసింది. అతడి పాస్‌పోర్ట్‌ను వెంటనే విడుదల చేయాలని డీఆర్‌టీని ఆదేశించింది. రుణాన్ని చెల్లించటంలోవిఫలం కావటంతో 2015లో బ్యాంకులు శంభుకుమార్‌కు వ్యతిరేకంగా డీఆర్‌టీలో కేసు వేశాయి.

కశ్మీర్ సరిహద్దుల్లో 300 మంది ఉగ్ర వాదులు!

శ్రీనగర్, డిసెంబర్ 16: దేశానికి ఉగ్రవాదుల చొరబాటు ముప్పు పొంచి ఉన్నదని, దాదాపు 250-300 మంది ఉగ్రవాదులు దేశంలోకి చొరబడేందుకు జమ్ముకశ్మీర్ సరిహద్దుల వెంబడి వేచిచూస్తున్నారని సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) ఐజీ అశోక్ యాదవ్ వెల్లడించారు. లాంచ్‌పాడ్‌ల వద్ద 250-300 మంది ఉగ్రవాదులు దేశంలోకి చొరబడేందుకు వేచిచూస్తున్నారనే సమాచారం ఉన్నదని తెలిపారు. అయితే చొరబాటు యత్నాలను సమర్థవంతంగా భగ్నం చేస్తామన్నారు. గత కొన్నేండ్లుగా భద్రతా బలగాలు, కశ్మీర్ ప్రజల మధ్య బంధం పెరిగిందని అన్నారు. ప్రజలు తమకు సహకారం అందిస్తే.. అభివృద్ధి కార్యకలాపాలను తాము మరింత మెరుగైన మార్గంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

జనగణన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: వచ్చే ఏడాది జరుగనున్న జనగణన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కర్ణాటకలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెంచడానికే ఈ రిజర్వేషన్లు తెచ్చినట్టు వెల్లడించారు. కాగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును సెప్టెంబర్‌లో పార్లమెంట్ ఆమోదించిన విషయం తెలిసిందే.

రాహుల్‌కు యూపీ కోర్టు సమన్లు

సుల్తాన్‌పూర్, డిసెంబర్ 16: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్ సుల్తాన్‌పూర్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు సమన్లు జారీచేసింది. జనవరి 6న కోర్టు ముందు విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అమిత్‌షాపై రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నేత విజయ్ మిశ్రా 2018, ఆగస్టు 4న కేసు వేశారు. ఈ కేసులో డిసెంబర్ 16న(శనివారం) హాజరుకావాలని అంతకుముందు సమన్లు జారీ చేయగా.. రాహుల్ కోర్టుకు రాలేదు. దీంతో తాజాగా మరోసారి ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు మరోసారి సమన్లు ఇచ్చిందని పిటిషన్‌దారు తరపు న్యాయవాది సంతోష్ పాండే తెలిపారు.

కేరళలో మళ్లీ కొవిడ్ భయం

వెలుగు చూసిన కొత్త సబ్ వేరియంట్ జేఎన్.1

న్యూఢిల్లీ: వ్యాధి నిరోధక వ్యవస్థకు దొరక్కుండా వేగంగా వ్యాపించే కొవిడ్ సబ్ వేరియంట్ జేఎన్.1 కేరళలో వెలుగు చూసింది. లేబరేటరీ ఇండియా సార్స్ కొవిడ్-2 జెనోమిక్స్ కన్సార్టియం చీఫ్ ఆరోరా మాట్లాడుతూ ఇది బీఏ.2.86 సబ్ వేరియంట్ అని, ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమెరికాలో తొలి కేసు వెలుగు చూడగా, కేరళలో నవంబర్‌లో అడుగు పెట్టిందని చెప్పారు. దీని వలన ఎవరికీ ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడలేదని దవాఖానలో చేరలేదని చెప్పారు. ఐఎంఏ జాతీయ కొవిడ్ టాస్క్ ఫోర్స్ కో-చైర్మన్ జయదేవన్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రయాణికుల కారణంగా ఇది కేరళకు వచ్చి ఉంటుందన్నారు.

ధారావి ప్రాజెక్టును నిరసిస్తూ ఠాక్రే భారీ ర్యాలీ

ధారావి ప్రాజెక్టును నిరసిస్తూ అదానీ గ్రూపునకు వ్యతిరేకంగా శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో శనివారం ముంబైలో భారీ ర్యాలీ జరిగింది. ధారావి నుంచి అదానీ రియాల్టీ కార్యాలయం ఉండే బాంద్రా కుర్లా కాంపెక్స్ వరకూ ఈ మార్చ్ చేపట్టారు. అభివృద్ధికి తాము వ్యతిరేకంగా కాదని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) కుంభకోణం అని ఠాక్రే ఆరోపించారు.

విదేశీ వర్సిటీల ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులకు గుర్తింపు లేదు: యూజీసీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: దేశంలో వివిధ ఎడ్‌టెక్ కంపెనీలు, కాలేజీలు విదేశీ వర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకొని ఆఫర్ చేస్తున్న ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులకు గుర్తింపు లేదని యూజీసీ వెల్లడించింది. ఈ తరహా కోర్సుల్లో చేరవద్దని విద్యార్థులకు శనివారం హెచ్చరిక జారీ చేసింది. కాలేజీలు, ఎడ్‌టెక్ కంపెనీలు విదేశీ వర్సిటీలతో కుదుర్చుకున్న ఒప్పందాలకు యూజీసీ నుంచి అనుమతి, గుర్తింపు లేదని, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే తగిన చర్యలుంటాయని స్పష్టం చేసింది. 'దేశీయంగా పలు ఎడ్‌టెక్ కంపెనీలు, కాలేజీలు ఆన్‌లైన్‌లో వివిధ కోర్సులు, డిగ్రీలను ఆఫర్ చేస్తున్న సంగతి మా దృష్టికి వచ్చింది. దిన పత్రికలు, సోషల్‌మీడియా, టీవీల్లో ప్రకటనలు జారీ చేస్తున్నాయి. ఆన్‌లైన్ విధానంలో ఆఫర్ చేస్తున్న డిగ్రీ, డిప్లొమా కోర్సులకు యూజీసీ గుర్తింపు లేదు' అని యూజీసీ సెక్రెటరీ మనీశ్ జోషి చెప్పారు.

ఆ నగదుతో కాంగ్రెస్‌కు సంబంధం లేదు

ఆ డబ్బుకు లెక్కలు చెప్తాం..ఐటీ దాడులపై ఎంపీ ధీరజ్ సాహు

న్యూఢిల్లీ : ఇటీవల ఒడిశాలో ఐటీ శాఖ దాడుల్లో పట్టుబడిన నగదుతో కాంగ్రెస్ పార్టీకి కానీ, ఏదైనా ఇతర రాజకీయ పార్టీకి కానీ సంబంధం లేదని కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు చెప్పారు. ఈ సొమ్ము తనది కాదని.. తన కుటుంబసభ్యులకు, ఇతర సంస్థలకు సంబంధించినదని తెలిపారు. తన సంస్థ దాదాపు వందేండ్లకుపైగా వ్యాపార రంగంలో ఉందన్నారు. మద్యం వ్యాపారంలో లావాదేవీలు నగదు రూపంలోనే జరుగుతాయన్నారు. పట్టుబడిన నగదు డిస్టిలరీ కంపెనీకి చెందినదని తెలిపారు. పట్టుబడిన నగదుకు లెక్కలు చెబుతానని తెలిపారు. ఇదంతా నల్లధనమని బీజేపీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ, నల్ల ధనమా? తెల్ల ధనమా? అనే విషయాన్ని ఐటీ శాఖ నిర్ణయిస్తుందన్నారు. ఒడిశాలో ధీరజ్ సాహుకు చెందిన బౌధ్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాలపై సోదాల్లో ఐటీ అధికారులు రూ.353 కోట్ల నగదును స్వాధీనం చేసుకొన్న విషయం తెలిసిందే.

మోదీని విమర్శిస్తే ఎదురుదాడే

- అమెరికా కేంద్రంగా ఉన్న డిస్‌ఇన్ఫో ల్యాబ్ పని ఇదే
- ప్రధానిని విమర్శించే వారే లక్ష్యంగా అసత్య పోస్టులు
- 'వాషింగ్టన్ పోస్ట్' పరిశోధనాత్మక కథనంలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకొని ఓ రహస్య సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నదని అమెరికా వార్తాపత్రిక 'వాషింగ్టన్ పోస్ట్' ఓ పరిశోధనాత్మక కథనాన్ని వెలువరించింది. 2020లో 'డిస్‌ఇన్ఫో ల్యాబ్' పేరిట ఏర్పాటు చేసిన ఈ సంస్థను 39 ఏండ్ల లెఫ్టినెంట్ కల్నల్ దివ్య సత్పాతి నడిపిస్తున్నట్టు తెలిపింది. ప్రధాని మోదీ ప్రభుత్వ విధానాలను విమర్శించే అమెరికాకు చెందిన అధికారులు, పరిశోధకులు, స్వచ్ఛంద సంస్థలు, భారత్-అమెరికా హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని అసత్య ప్రచారంతో కూడిన కించపరిచే పోస్టులను డిస్‌ఇన్ఫో ల్యాబ్ సంస్థ ప్రచారం చేస్తున్నట్టు ఆరోపించింది.

ప్రముఖ సామాజిక వేదిక 'ఎక్స్'లో ఈ సంస్థ పోస్ట్ చేసిన దాదాపు లక్ష పోస్టులను విశ్లేషించిన అనంతరం ఈ నిర్ధారణకు వచ్చినట్టు పత్రిక వివరించింది.

'రా', బీజేపీతో సంబంధాలు

తమ సంస్థ ఎవరికీ అనుకూలంగా వ్యవహరించబోదని చెప్పుకొనే డిస్‌ఇన్ఫో ల్యాబ్.. బీజేపీకి బాకా ఊదేలా పనిచేస్తున్నదని పత్రిక ఆరోపించింది. సంస్థను నిర్వహిస్తున్న దివ్యకు భారత విదేశీ నిఘా ఏజెన్సీ, మిలిటరీ, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా)తో పాటు బీజేపీకి చెందిన కీలక నేతలతో సత్సంబంధాలు ఉన్నట్టు వివరించింది. కరోనా కట్టడిలో కేంద్రం విఫలమవ్వడం, దళితులపై దేశంలో పెరుగుతున్న దాడులపై ప్రశ్నించిన అమెరికాకు చెందిన హక్కుల కార్యకర్తలకు వ్యతిరేకంగా, వారిని కించపరిచే విధంగా పలు అసత్య వార్తలను ఈ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిందని పత్రిక ఆరోపించింది. వాటిని ఇక్కడి బీజేపీ పరివారం విస్తృతంగా ప్రచారం చేసి.. ప్రజలను తప్పుదోవ పట్టించినట్టు వెల్లడించింది. ఇదే అంశంపై డిస్‌ఇన్ఫో ల్యాబ్‌తో పాటు, భారత ప్రభుత్వాన్ని సంప్రదిస్తే, ఎలాంటి సమాధానం రాలేదని పత్రిక వివరించింది.

అయోధ్యకు వెయ్యి రైళ్లు

రామాలయం ప్రారంభోత్సవం నుంచి 100 రోజుల పాటు చాన్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: అయోధ్య రామ మందిరాన్ని చేరుకోవాలనుకుంటున్న కోట్లాది మంది భక్తులకు భారతీయ రైల్వే శుభవార్త చెప్పింది. దేశం నలుమూలల నుంచి 1000 రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. జనవరి 19 నుంచి 100 రోజులపాటు ఈ రైళ్లను నడుపుతామని రైల్వే వర్గాలు తెలిపాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పుణె, నాగ్‌పూర్, లక్నో, జమ్ము, బెంగళూరు..ఇలా అన్ని ప్రాంతాల్లోని నగరాలను అయోధ్యకు కలుపుతూ 100 రోజులపాటు రైల్వే సేవల్ని కొనసాగిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. రోజూ 50 వేల మంది స్టేషన్‌లో దిగే విధంగా అయోధ్య స్టేషన్‌ను రీడిజైన్ చేశామన్నారు.

జనవరి 22న రావొద్దని విన్నపం

జనవరి 22న ఆలయ ప్రారంభోత్సవ వేడుక నిమిత్తం అయోధ్యకు రావొద్దని 'రామ మందిర్ ట్రస్ట్' సెక్రెటరీ చంపత్ రాయ్ భక్తులను కోరారు. 'విగ్రహ ప్రతిష్ఠకు ఆలయం సిద్ధం. కానీ ఆలయ నిర్మాణం పూర్తి కావాలంటే మరో రెండేండ్లు పడుతుంది. చాలా పనులు జరగాల్సి ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని, వారిని రావొద్దని సూచిస్తున్నా. ఆ రోజు భక్తులు తమకు దగ్గర్లో ఉన్న ఆలయానికి వెళ్లాల్సిందిగా కోరుతున్నా' అని అన్నారు.

ఆ నాలుగు విషయాలు కలవరపెట్టాయి!

కేంద్రం విధానాలపై జస్టిస్ నారీమన్ ధ్వజం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది దేశంలో నాలుగు కలవరపెట్టే ఘటనలు జరిగాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్ అన్నారు. 'కాన్‌స్టిట్యూషన్: చెక్ అండ్ బ్యాలెన్సస్' పేరిట ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో మాట్లాడిన ఆయన గడిచిన ఏడాది కాలంలో జరిగిన నాలుగు కీలక పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు.

బీబీసీపై ఐటీ దాడులు: 2002 గుజరాత్ అల్లర్ల ఘటనలో ప్రధాని నరేంద్ర మోదీ పాత్రపై డాక్యుమెంటరీని ప్రసారం చేసిన బీబీసీపై ఫిబ్రవరిలో ఐటీ దాడులు జరిగాయి. దీనిపై స్పందించిన జస్టిస్ నారీమన్.. ఇది మీడియా హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. స్వతంత్రంగా రిపోర్టింగ్ చేసిన మీడియాను అణచివేసి చంపేస్తే, ఇక ఏదీ మిగలబోదని మండిపడ్డారు.

ఈసీ ప్యానెల్ ఉదంతం: ఎన్నికల కమిషనర్ల నియామకాలను చేపట్టే త్రిసభ్య కమిటీ నుంచి సీజేఐను తొలగించి, ఆ స్థానంలో కేంద్రమంత్రిని తీసుకొస్తూ ఆగస్టులో కేంద్రప్రభుత్వం బిల్లు తీసుకొచ్చింది. దీనిపై జస్టిస్ నారీమన్ స్పందిస్తూ.. ఇది దురదృష్టకర పరిణామమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పారదర్శక ఎన్నికలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

కేరళ గవర్నర్ రగడ: కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ పలు బిల్లులను తన దగ్గరే పెట్టుకోవడాన్ని జస్టిస్ నారీమన్ తప్పుబట్టారు. 23 నెలల పాటు బిల్లులను ఆమోదించకుండా అలాగే పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

ఆర్టికల్ 370 రద్దు తీర్పు: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమేనని ఇటీవల సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. దీనిపై జస్టిస్ నారీమన్ స్పందిస్తూ.. కోర్టు తీర్పు సమాఖ్య స్ఫూర్తిపై తీవ్ర ప్రభావం చూపేలా ఉందన్నారు. ఐదేండ్లు గడిచినప్పటికీ కశ్మీర్‌లో ప్రజాప్రభుత్వ స్థాపన జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

వాతావరణానికి తగ్గట్టు మారే దుస్తులొస్తున్నాయి!

న్యూఢిల్లీ: వస్త్ర ధారణలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. పరిశోధకులు సౌర శక్తితో నడిచే దుస్తులను అభివృద్ధిపరిచారు. ఫ్లెక్సిబుల్ సోలార్ సెల్స్, ఎలక్ట్రానిక్ డివైస్‌ను ఉపయోగించి ఈ వస్త్రాలను రూపొందించారు. ఈ బట్టలను ధరించిన వారి శరీరం వాతావరణంలోని ఉష్ణోగ్రతల్లో మార్పులను తట్టుకోగలుగుతుంది. వాతావరణంలో ఉష్ణోగ్రత 12.5 డిగ్రీల నుంచి 37.6 డిగ్రీల మధ్యలో ఉన్నపుడు ఈ స్మార్ట్ దుస్తులను ధరించినవారు 32-36 డిగ్రీల థర్మల్ జోన్‌లో ఉన్నట్లుగా అనుభూతి చెంది, హాయిగా ఉండగలుగుతారు. ఈ వస్త్రాలను 12 గంటల పాటు సూర్య కాంతిలో ఛార్జింగ్ చేస్తే, 24 గంటలపాటు ధరించవచ్చు. ఈ పరిశోధన వివరాలను 'సైన్స్' జర్నల్ ప్రచురించింది.

700 కోట్ల హెరాయిన్ కేసులో కీలక నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: అమృత్‌సర్‌లోని అట్టారి సరిహద్దు వద్ద పట్టుబడ్డ రూ.700 కోట్ల విలువైన హెరాయిన్ కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక నిందితుడిని అరెస్టు చేసింది. పంజాబ్‌లోని తార్న్‌తరన్ జిల్లాకు చెందిన అమృత్‌పాల్ సింగ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. 2022 ఏప్రిల్ 24, 26 తేదీల్లో 102 కిలోల హెరాయిన్ అట్టారి సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడింది.

'జీవన నైపుణ్యాలు' తెలిసింది 40 శాతానికే

- భారత యువతలో నైపుణ్యాల నిర్వచనంపై కొరవడిన స్పష్టత
- ది వాయిసెస్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: ఆధునిక ప్రపంచంలో సక్సెస్ కావాలంటే కొన్ని శక్తి, సామర్థ్యాలు, సమర్థతలు అవసరం. వీటినే జీవన నైపుణ్యాలు లేదా 21వ శతాబ్దపు నైపుణ్యాలు అంటారు. వీటి గురించి విన్న భారత యువత, బాలలు సుమారు 40 శాతం మంది మాత్రమేనని 'ది వాయిసెస్ సర్వే' అధ్యయనంలో వెల్లడైంది. వీటి గురించి విన్నవారిలో 14 నుంచి 18 సంవత్సరాల వయసు గలవారి కన్నా 19 నుంచి 22 సంవత్సరాల వయసు గలవారు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. 11 జిల్లాల్లోని 15,856 మంది యువత, 13,806 మంది తల్లిదండ్రులు, 2,366 మంది స్కూల్ టీచర్లు ఈ సర్వేలో పాల్గొన్నారు.

21వ శతాబ్దపు నైపుణ్యాలు అంటే విమర్శనాత్మకంగా ఆలోచించడం, సృజనాత్మకత, డిజిటల్ లిటరసీ, సాంస్కృతిక అవగాహన వంటివి. ఇవి సంప్రదాయ విద్యా సంబంధిత విజ్ఞానానికి భిన్నమైనవి. ఆధునిక ప్రపంచంలో జీవనం, విద్యాభ్యాసం, ఉద్యోగం, వ్యక్తిగత వికాసం వంటి వాటిలో విజయానికి ఇవి అవసరం.

వీటి గురించి విన్నవారు ఎవరంటే...

ఉన్నత విద్యాభ్యాసం చేసినవారు, ఫోన్లను వాడగలిగే వారు, తల్లిదండ్రులు ఉన్నత విద్యావంతులైనపుడు యువత జీవన నైపుణ్యాల గురించి వినే అవకాశం ఎక్కువగా ఉన్నది. ఈ విషయంలో స్త్రీ, పురుషుల్లో కొద్దిగా తేడా ఉన్నది. ఈ నైపుణ్యాల గురించి తెలుసునని చెప్పినవారు సైతం పొరబడుతున్నారు. వృత్తి విద్యా నైపుణ్యాలు, ఇతర రోజువారీ నైపుణ్యాలే 21వ శతాబ్దపు నైపుణ్యాలని భావిస్తున్నారు. ఇతరులతో సంబంధాల నిర్వహణ, ఒత్తిడిని తట్టుకోగలగడం వంటివి జీవన నైపుణ్యాలని 90% మంది యువత చెప్పారు. వంట చేయడం, సైక్లింగ్ వంటివి జీవన నైపుణ్యాలని 80% మంది అభిప్రాయపడ్డారు. సమస్యను పరిష్కరించగలగడం, నిర్ణయాలు తీసుకోగలగడం గురించి తెలుసునని చెప్పినవారు 70 శాతం మంది కన్నా ఎక్కువగా ఉన్నారు. క్రిటికల్ థింకింగ్, తట్టుకోగలగడం గురించి అడిగినపుడు అత్యధికులు ఇబ్బందిపడ్డారు.

ఎక్కడ తెలుసుకుంటారు?

ఈ నైపుణ్యాల గురించి తెలుసునని చెప్పిన యువతలో 65 శాతం మంది టీచర్లపై ఆధారపడ్డారని, 36% మంది పాఠశాల పుస్తకాలపై ఆధారపడ్డారని వెల్లడైంది. విద్యా సంస్థల్లో ఈ నైపుణ్యాలను నేర్చుకోవచ్చునని 86% మంది యువత, 75% మంది తల్లిదండ్రులు చెప్పారు.